కూటమి.. రైతు వ్యతిరేక ప్రభుత్వం

- అన్నదాత పోరుకు అడుగడుగునా ఆంక్షలు పెట్టారు..
- వైఎస్సార్‌సీపీ నేతలను భయబ్రాంతులకు గురి చేశారు..
- యూరియా కోసం రైతులు రోడ్లెక్కాల్సిన దుస్థితి
- బ్లాక్ మార్కెట్‌లో రూ.600 నుంచి రూ.700 వరకు అమ్మకాలు
- ఖరీఫ్‌పై కనీసం ముందస్తు సమీక్షలు, ప్రణాళికలు లేవు
- రైతు సమస్యలపై సమీక్షించేందుకు ప్రజాప్రతినిధులకు తీరిక లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



అన్నదాత పోరు ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు,నాయకులు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు


ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో బైఠాయించిన రైతులు

చీపురుపల్లి: 'ఖరీఫ్ సీజన్‌లో యూరియా లభించక రైతులు అల్లాడిపోతున్నారు.. తెల్లారే సరికి యూరియా కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితులు దాపురించాయి.. ఓ వైపు సాగు నీరు లేక, మరోవైపు ఎరువులు లేక రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నా పట్టించుకునే ప్రజాప్రతినిధి లేకపోవడం దారుణం , అసలు రైతు సమస్యలు పట్టించుకునే తీరిక జిల్లాలో ఎమ్మెల్యేలు, మంత్రికి లేకపోవడం దౌర్భాగ్యమని..' జిల్లా పరిషత్ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. యూరియా కొరత, బ్లాక్ మార్కెట్ కారణంగా రైతులు ఎదుర్కొంటున్న అవస్థలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ స్థాయిలో చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

యూరియా కోసం రోడ్లెక్కాల్సిన దుస్థితి

రైతులు యూరియా కోసం రోడ్లెక్కాల్సిన దుస్థితి మళ్లీ ఏర్పడిందని జిల్లా పరిషత్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మండిపడ్డారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రోజు కూడా ఇలా యూరియా కోసం రైతులు ఎందుకు రోడ్లపై కనపడలేదని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే వ్యవసాయ శాఖతో సమీక్షలు నిర్వహించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఏ స్థాయిలో అవసరమో ప్రణాళికలు సిద్ధం చేసుకోకపోవడమే నేటి దుస్థితికి కారణమన్నారు. 2024 సెప్టెంబరు 9 నాటికి జిల్లాలో 27 వేల టన్నులు యూరియా పంపిణీ చేస్తే ఈ ఏడాది సెప్టెంబరు 9 నాటికి కూటమి ప్రభుత్వం 15 వేల టన్నులు మాత్రమే యూరియా ఇచ్చిందన్నారు.

ఉత్తరాంధ్రలోనే వ్యవసాయ మంత్రి

ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నప్పటికీ పార్వతీపురం మన్యం జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నప్పటికీ ఖరీఫ్ సీజన్‌లో ప్రణాళికల కోసం కనీసం చర్యలు తీసుకోలేదని మజ్జి శ్రీనివాసరావు మండిపడ్డారు. అంతేకాకుండా రైతులు ఎరువుల కోసం ఉదయం నుంచి లైన్లు కట్టి నిలబడి అవస్థలు పడుతుంటే బఫే భోజనాలు కోసం లైన్లలో నిలబడలేదా.. అంటూ రైతులను అవహేళన చేస్తూ మాట్లాడడం దారుణంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేయడమే రైతులు చేసుకున్న పాపమా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి రైతే రాజు సిద్ధాంతాన్ని పాటించి ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంతో బాటు పంటల బీమా, పెట్టుబడి సహాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎరువులు ఎలాగూ లేవు సరికదా పంటల బీమా కూడా లేదన్నారు. రైతుల వెంట వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వారి పక్షాన పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

బ్లాక్ మార్కెట్‌లోకి యూరియా..

కూటమి ప్రభుత్వంలో రైతులకు చేరాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందని రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డా.తలే రాజేష్ అన్నారు. రూ.270కు లభించాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్‌లో రూ.600 నుంచి రూ.700 వరకు రైతులు కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇలా యూరియా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.350 కోట్లు వరకు కుంభకోణం జరిగిందన్నారు. రైతులు కష్టాలు వినేందుకు కూటమి ప్రభుత్వంలో ఎవ్వరూ లేరన్నారు. రైతులు పక్షాన అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధపడిన వైఎస్సార్‌సీపీ నాయకులను భయబ్రాంతులకు గురి చేశారన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, చీపురుపల్లి నియోజకవర్గ నాయకులు ఎస్‌వి.రమణరాజు, కెవి.సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు, మీసాల విశ్వేశ్వరరావు, బమ్మిడి కార్తీక్, పొన్నాడ కుమార్, వాకాడ శ్రీనివాసరావు, కోట్ల వెంకటరావు, తాడ్డి వేణు, బూర్లె నరేష్, పిఎస్ఆర్‌కె.ప్రసాద్, పాట్నూరు సన్యాశినాయుడు, శీర అప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, స్వామినాయుడు, రాజాం నియోజకవర్గ నాయకులు సిరిపురపు జగన్‌మోహనరావు, టంకాల అచ్చంనాయుడు, పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, బండి నర్సింహులు, ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, వాకమల్లు చిన్నంనాయుడు, కరణం సుదర్శనరావు, వావిలపల్లి జగన్‌మోహనరావు, మరిశర్ల గంగాధర్, వంజరాపు విజయ్‌కుమార్, పాలవలస శ్యామ్‌సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా పోలీసుల అడ్డంకులు

ఈ సందర్భంగా పట్టణంలోని లావేరురోడ్‌లో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీ ర్యాలీతో సిద్ధమయ్యారు. కార్యాలయం వెలుపల ప్రధాన రోడ్డుపైకి రాగానే అప్పటికే డీఎస్పీ ఎస్.రాఘవులు నేతృత్వంలో మోహరించి ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తామని చెప్పినప్పటికీ పోలీసులు వినిపించుకోలేదు. దీంతో రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పోలీసులు మధ్య తోపులాట జరిగింది. అనంతరం ముందుకు సాగిన ర్యాలీలో రైతులు, కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ యూరియా ఇవ్వాలి, సీఎం డౌన్ డౌన్ అంటూ వెళ్తుండగా పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌లో మరోసారి పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. అక్కడ కూడా ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అంతేకాకుండా మూడు రోడ్ల జంక్షన్‌లో పలువురు రైతులు, కార్యకర్తలు ప్రధాన రహదారిపై బైఠాయించి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఇన్‌చార్జి ఆర్డీవో బి.ఆశియ్యకు వినతిపత్రం అందజేశారు.

అన్నదాత పోరు..

విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుకు బాసటగా చీపురుపల్లి, రాజాం వైసీపీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

రైతులను 'కూటమి' మోసం చేసింది


జామి: భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద రైతు పోరు నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జీసీసీ మాజీ ఛైర్మన్ శోభా స్వాతిరాణి తదితరులు

జామి: రైతులను అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ తలపెట్టిన రైతు పోరు కార్యక్రమానికి ఆ పార్టీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ నుంచి ప్రారంభించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జీసీసీ మాజీ ఛైర్మన్ శోభాస్వాతిరాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ముందుగా యూరియా బస్తాతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు అనుబంధ విభాగాల నేతలు, రైతులు పాల్గొన్నారు.


దత్తిరాజేరు : అన్నదాత పోరుకు బొబ్బిలి తరలి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రైతు పోరుకు కదలిన రైతులు

దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వం రైతులకు యూరియా తగినంత ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడంతో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బొబ్బిలి ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి మండలం నుంచి భారీగా ఆ పార్టీ శ్రేణులు, రైతులు తరలి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వందలాది మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

తరలిన నేతలు

శృంగవరపుకోట : రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం యూరియా అందక అవస్థలు పడుతున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి మంగళవారం ఎస్.కోట నుంచి పెద్ద సంఖ్యలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు విజయనగరం తరలి వెళ్లారు. ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్ నేతృత్వంలో జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, వాకాడ రాంబాబు, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, ఎంపీటీసీ కె.అప్పయ్య, మమ్ములూరి సోంబాబు, రంధి అనంత్, మండల యువజన విభాగం అధ్యక్షులు వాకాడ సతీష్, ఎలమంచిలి అప్పారావు, అప్పలసత్యం, చిప్పాడ రమణ, తగరంపూడి రమణ, చిట్టిపోలు రమణ, తిమిడి అప్పలనాయుడు, పాలమరశెట్టి రామకృష్ణ తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన అన్నదాత పోరులో పాల్గొని రైతులకు బాసటగా నిలిచారు.


ఎస్.కోట నుంచి అన్నదాత పోరుకు విజయనగరం వెళ్తున్న ఎస్.కోటకు చెందిన నేతలు

ఒక్క యూరియా బస్తా కూడా దొరకలేదు


ఈ ఖరీఫ్‌లో యూరియా ఒక బస్తా కూడా దొరకలేదు. నాకు ఐదు ఎకరాలు భూమి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంట సాగు చేశాను. యూరియా కోసం ఎదురు చూశాను. సచివాలయానికి రాలేదు. దిక్కులేక పాస్ఫేట్ వేసుకోవాల్సి వచ్చింది. వరి పంట పాడైపోతుంది. ఏమి చేయాలో తోచటం లేదు.

బూరాడ అప్పలనాయుడు. జి.అగ్రహారం గ్రామం, చీపురుపల్లి మండలం

పడిగాపులు కాశా..


యూరియా బస్తా కోసం ఎండల్లో నిరీక్షించినా ఒక బస్తా కూడా దొరకలేదు. వరి పంటలో యూరియా ఉపయోగిస్తేనే పంట పెరుగుదల బాగుంటుంది. నాకు 5 ఎకరాలు భూమి ఉంది. ఐదు ఎకరాల్లో కూడా వరి సాగు చేశాను. గతంలో ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరికేది. ఈ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు.

కె.రామారావు. రేగటి గ్రామం, గరివిడి మండలం

నరకయాతన పడుతున్నాం..


ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది యూరియా కోసం నరకయాతన అనుభవిస్తున్నాం. ఈ దిక్కుమాలిన ప్రభుత్వంలో యూరియా కష్టాలు తప్పటం లేదు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా సరే ఇదే పరిస్థితి. రైతు గోడు పట్టించుకోడు. నాకు మూడు ఎకరాల భూమి ఉంది. గతంలో ఎన్ని కావాలంటే అన్ని యూరియా బస్తాలు దొరికేవి. రెండు నెలలుగా ఎదురు చూస్తున్నాం. ఒక్క యూరియా బస్తా కూడా అందలేదు.

మీసాల సన్యాసినాయుడు, గంట్రేటి కొత్తపేట, గుర్ల మండలం.

యూరియా కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి


యూరియా కోసం రోడ్డు మీద పడిగాపుల కాయాల్సిన పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వంలో గ్రామాల్లోనికి యూరియా అందుబాటులోకి వచ్చేది. ఈ ఏడాది యూరియా బస్తా కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. నాకు 4 ఎకరాల భూమి ఉంది. వరి పంటను సాగు చేశాను. సమయానికి యూరియా అందలేదు. యూరియా లేకపోతే వరి పంట సాగు చేయటం అనవసరం. రోడ్డెక్కినా యూరియా అందలేదు.

పిన్నింటి సన్యాసప్పలనాయుడు, మందిరవలస, గరివిడి మండలం

క్లుప్తంగా

సురక్షిత తాగునీరు అందించండి


గరుడబిల్లిలో రక్షిత మంచినీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

బొండపల్లి: గ్రామాలలో రక్షిత మంచినీటి పథకాల ద్వారా సురక్షిత తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో కె.శిరీషా రాణి పేర్కొన్నారు. మండలంలోని గరుడబిల్లి గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించి తర్వాత గ్రామంలో గల రక్షిత మంచినీటి ట్యాంక్‌లను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ బొద్దల కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

యూరియా కోసం తోపులాట


టి బూర్జవలస రైతు సేవా కేంద్రంలో యూరియా కోసం రైతుల తోపులాట

దత్తిరాజేరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వం అరకొరగా సరఫరా చేయడంతో రైతులు గంటలు, రోజులకొద్దీ నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో అందే ఒక్క యూరియా బస్తా కోసం తోపులాటకు దిగుతున్నారు. టి.బూర్జవలస రైతు సేవా కేంద్రం పరిధిలో ఏడు గ్రామాల రైతులు వందలాది మంది ఉండగా సుమారు 20 టన్నుల యూరియా కావాల్సి ఉంది. వారికి సుమారు ఏడు టన్నుల యూరియా బస్తాలు తెచ్చి మంగళవారం పంపిణీ చేయడంతో రైతులు తోపులాటకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

పారిశుధ్య పనులపై ఆరా..!

గజపతినగరం: మండలంలోని అన్ని గ్రామాల్లోను పూర్తి స్థాయిలో శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు చేపట్టాల్సిన అవసరం ఉందని మండల పరిషత్ సిబ్బందిని డీఎల్‌పీవో కిరణ్ కుమార్ ఆదేశించారు. కొత్తశ్రీరంగ రాజపురాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య పనులు సకాలంలో సరిగా జరగాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సూత్రాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో చల్లా సుగుణకరరావు, పంచాయతీ కార్యదర్శి యశోద తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమక్షంలో ఎరువుల పంపిణీ


సాతాంవలస పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు

మెరకముడిదాం: మండలంలోని సాతాంవలస పీఏసీఎస్ వద్ద రైతులకు అవసరమైన ఎరువులను పోలీసుల సమక్షంలో వ్యవసాయ శాఖ అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది కలిసి పంపిణీ చేస్తున్నారు. అయితే ఇక్కడ ఎరువులను అధికార పార్టీ నాయకులు సిఫారుసులు మేరకు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అధికారులు అప్రమత్తమై పోలీసులు పహారాలో ఎరువులను పంపిణీ చేశారు. అయితే ఒక ఆధార్ కార్డుపై ఒక్క బస్తా యూరియా మాత్రమే పంపిణీ చేస్తుండడంతో తమకు ఎక్కడ యూరియా అందుతుందో లేదో అన్న సందేహంతో రైతులు ఉదయం నుంచే పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాశారు.

పీఆర్‌సీ, డీఏలను విడుదల చేయాలి

మెరకముడిదాం: ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పీఆర్‌సీ, డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వున్న ఉపాధ్యాయులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ, డీఏలకు సంబంధించిన పాత బకాయిలఎరియర్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయులపై ప్రభుత్వం పని ఒత్తిడిని తగ్గించాలని, ఇందులో భాగంగా అసెస్మెంట్ బుక్‌లెట్స్ భారాన్ని తగ్గించి ప్రశ్నాపత్రాలను సులభతరం చేయాలని కోరారు. సరెండర్ లీవ్స్‌ను వెంటనే నగదు రూపంలో ఇప్పించాలన్నారు. పాఠశాలల్లో ప్రస్తుతం అమలులో వున్న రకరకాల యాప్‌లను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆ సంఘ నాయకులు ఎస్.రామారావు, వై.శ్రీనివాసరావు, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేయాలి

గుర్ల: మండలంలో భర్త చనిపోయి స్పౌజ్ పింఛన్ మంజూరైనప్పటికీ అధికారులు మాత్రం పింఛన్ నగదు పంపిణీ చేయటం లేదని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పాట్నూరు సన్యాసినాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గుజ్జింగివలస, పున్నపురెడ్డిపేటలో తొమ్మిది స్పౌజ్ పింఛన్(వితంతు)లు మంజూరై రెండు నెలలు గడుస్తున్నా నగదు మాత్రం అందించటం లేదన్నారు. ఈ పింఛన్లను స్థానిక టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

సర్వీసు రోడ్డు 20 అడుగులు ఉండాల్సిందే..

చీపురుపల్లి: పట్టణంలో నుంచి రైల్వే ఓవర్ బ్రిడ్జిను ఆనుకుని రిక్షా కాలనీకు 20 అడుగులు సర్వీసు రోడ్డు ఉండాల్సిందేనని కొత్తఅగ్రహారం, రిక్షా కాలనీ వాసులు స్పష్టం చేశారు. సర్వీసు రోడ్డు విషయంలో అస్పష్టత ఉండడంతో మంగళవారం రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులు సర్వీసు రోడ్డు విషయమై పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన కాలనీకి చెందిన మజ్జి శంకరరావు, మహంతి లక్ష్మణ, ఇజ్జరోతు రాంబాబు నేతృత్వంలో కొంత మంది కొత్తఅగ్రహారం, రిక్షా కాలనీలకు 20 అడుగులు సర్వీసు ఉండాలని కోరారు. ఇప్పటికే 12 అడుగులు సర్వీసు రోడ్డు కోసం ఆక్రమణలు కూడా తొలగించామని ఆర్అండ్‌బీ అధికారులు స్పష్టం చేశారు. 12 అడుగులు రోడ్డు సరిపోదని తద్వారా తమకు ఇబ్బందులు తప్పవని కనీసం 20 అడుగులు ఉండాలని వారు డిమాండ్ చేశారు. సర్వీసు రోడ్డు పనులు పూర్తి చేసిన తరువాత ఆర్ఓబీ పనులు చేపట్టాలని కోరారు. ఇంతవరకు సర్వీసు రోడ్డు విషయం తేలకపోవడంతోనే రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబీ) పనులు పూర్తి కావడం లేదు.

సంక్షిప్తంగా...

వెల్ఫేర్ అసిస్టెంట్ నియామకం

సాక్షి ఎఫెక్ట్

గంట్యాడ: పెదవేమలి గ్రామ సచివాలయానికి వెల్ఫేర్ అసిస్టెంట్ లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్న అంశంపై ఈ నెల 8వ తేదీన సాక్షిలో వెల్ఫేర్ అసిస్టెంట్ లేక అవస్థలు ..! శీర్షికన ప్రచురించిన కథనానికి మండల పరిషత్ అధికారులు స్పందించారు. పెదవేమలి సచివాలయానికి సిరిపురం వెల్ఫేర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

చీపురుపల్లి: లైసెన్స్ కలిగిన డీలర్లు అధిక స్థాయిలో ఎరువులు విక్రయాలు జరిపితే లైసెన్స్‌లు రద్దు చేసేందుకు సిఫారుసు చేయడం జరుగుతుందని ఏవో సూర్యకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలలో ఆధార్ నంబర్ ప్రకారం అధికంగా ఎరువులు విక్రయించినట్టు ఐఎఫ్ఎంఎస్‌లో నమోదై కలెక్టర్ లాగిన్‌లోకి వస్తే సదరు డీలర్ లైసెన్స్ రద్దు చేసేందుకు సిఫారుసు చేస్తామని తెలిపారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో బుధవారం హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో బి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు అమ్మవారి దేవస్థానం మండపంలో హుండీల ఆదాయం లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అమ్మవారి దేవస్థానంకు ట్రస్టు బోర్డు ఏర్పాటు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంకు 11 మంది సభ్యులతో కూడిన ట్రస్టు బోర్డును నియమిస్తూ ఏపీ ధార్మిక పరిషత్ నుంచి ఉత్తర్వులు వెలువడినట్టు దేవస్థానం ఈవో బి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో 11 మంది సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి అందులో ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకోనున్నట్టు తెలిపారు.

పశువైద్య శిబిరం

వేపాడ: మండలంలోని వెల్దాం గ్రామంలో వేపాడ పశువైద్యాధికారిణి కె.గాయిత్రీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 25 పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించారు. సాధారణ పశువులకు వైద్యసేవలు అందించి మందులు వేశారు. పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

వేపాడ: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ విద్యాభ్యాసనపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని ఎంఈవో నాగభూషణం అన్నారు. బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకం మెనూలో నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంఈవో 2 బాలభాస్కరరావు రామస్వామిపేట, కొండగంగుబూడి పాఠశాలలను సందర్శించారు.

కాళోజీకి నివాళి

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించి నివాళులు అర్పించారు.

ప్రిన్సిపాల్ డా.సి.హెచ్.కేశవరావు మాట్లాడుతూ కాళోజీ ప్రతి ఉద్యమ ప్రతిధ్వని, తెలంగాణ జీవిత చలనశీలి, రాజకీయ, సాంఘిక చైతన్యాల సమాహారం అన్నారు. గొప్ప స్వాతంత్య్ర సమర యోధుడు అని చెప్పారు. కాళోజీ కవితలను, ఆయన రచనల్లో గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు డా.ఆర్.శ్రీలక్ష్మి, వాసుదేవరావు, ఈరన్న, భాస్కర్, శ్రీనివాసరావు, సంధ్యారాణి, అప్పలరాజు, లక్ష్మణరావు, దివ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలి


బాధితులకు సాయం అందజేస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు

లక్కవరపుకోట : మండలంలోని మార్లాపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు కోరారు. గ్రామానికి చెందిన కళిరెడ్డి శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో ఒక్కో కుటుంబానికి 25 కేజీల చొప్పున బియ్యం, ఒక్కో ఆయిల్ డబ్బా, దుస్తులు, చదువుకున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లలు, దుప్పట్లు ఎంపీపీ శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో బాధిత కుటుంబాలకు దుప్పట్లు, నిత్యవసర సరుకులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి దొడ్డు సూర్యారావు, చందులూరు, రేగ ఎంపీటీసీలు యడ్ల కిశోర్‌కుమార్, బొడ్డు గణపతి తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడి సాగుపై అవగాహన

వేపాడ: జీడి మామిడి సాగు యాజమాన్య పద్ధతులు, కొమ్మ కత్తిరింపు, చీడపీడల నివారణపై రైతాంగం దృష్టి సారించాలని ఉద్యాన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు అన్నారు. మండలంలో కొండగంగుబూడి గ్రామంలో మంగళవారం ఉద్యానవన శాఖ అధికారిణి పి.పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జీడి మామిడి సాగు శిక్షణ కార్యక్రమంలో కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసరావు పాల్గొన్నారు. జీడి మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపులు, చీడపీడల నివారణపై పలు సూచనలు సలహాలు అందించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా అందించే పథకాలను వివరించారు. గ్రామాల్లో వైవిధ్య పంటలున్నాయన్నారు. తేనేటీగల పెంపకాన్ని ప్రోత్సహించినట్టయితే రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో ఎ.స్వాతి, సబల ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రావణి, రైతులు పాల్గొన్నారు.


ఏడీఏపై రైతుల ఆగ్రహం


టి బూర్జవలస రైతు సేవా కేంద్రం ముందు ఆందోళన చేస్తున్న భూపాలరాజపురం రైతులు

దత్తిరాజేరు: మండలంలోని భూపాలరాజపురంలో ఈనాం భూములు ఉన్న రైతులకు యూరియా ఇవ్వలేమని ఏడీఏ నిర్మలాజ్యోతి చెప్పడంతో రైతులు ఆమెపై మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల కిందట రైతులకు డీఏపీ ఇవ్వడంతో యూరియా కోసం రైతులు టి బూర్జవలస రైతు సేవా కేంద్రానికి మంగళవారం వెళ్లారు. క్యూలో ఉన్న రైతులు యూరియా ఇవ్వాలని ఏడీఏను అడగడంతో ఈ క్రాప్ లేనిదే యూరియా ఇవ్వలేమని తేల్చి చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనాం భూములున్న రైతులకు ఈ క్రాప్ ఎలా అవుతుందని, గతంలో ఇచ్చిన ఎరువులు ఇప్పుడు ఎందుకు ఇవ్వరని నిలదీశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని ఉత్తర్వులు వచ్చిన వెంటనే అందజేస్తామని ఏడీఏ తెలిపారని సర్పంచ్ నేరేడుబిల్లి గురునాయుడు తెలిపారు.

ప్రత్యేక పీజీఆర్ఎస్‌కు వెల్లువెత్తిన సమస్యలు

లక్కవరపుకోట : మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామాల్లో పేరుకుపోయిన పలు సమస్యలతో పాటు రెవెన్యూ సమస్యలపై ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులొచ్చాయి. ఒక్క మ్యుటేషన్ కోసమే 102 దరఖాస్తులు వచ్చాయంటే రెవెన్యూ సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. బుధవారం కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. రీసర్వే జరగని గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్లు టి.రమేష్, కోట అప్పారావు, ఆర్ఐ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ అధికారులు

తహసీల్దార్ తీరుపై సభ్యుల ధ్వజం

బొండపల్లి: తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు పనితీరుపై మండల సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో ఒంపల్లి సర్పంచ్ లండా నారాయణమ్మతో పాటు ఎంపీపీ చలంనాయుడు మాట్లాడుతూ రైతులు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేస్తే ఎటువంటి కారణం లేకుండా రిజక్ట్ చేస్తున్నారని, ఎందుకు అలా చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. దీంతో పలు గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారుల తీరుతో రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు. మ్యుటేషన్ కోసం డబ్బులిచ్చిన వారి పనులే జరుగుతున్నాయని ఆరోపించారు. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితులు మండలంలో నెలకొన్నాయని హెచ్చరించారు. గతంలో యూరియాకు ఎప్పుడూ ప్రస్తుత పరిస్థితి రాలేదని, కూటమి పాలనలో యూరియాకు ఎందుకు ఇలాంటి పరిస్థితులు వచ్చాయో చెప్పాలని ఏవోను ఎంపీపీ ప్రశ్నించారు. ఇప్పటి వరకు 65 శాతం యూరియా పంపిణీ చేశామని, వారం రోజుల్లో 60 టన్నుల యూరియా వస్తుందని పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని ఏవో చెప్పారు. గ్రామాల్లో నిజమైన దివ్యాంగుల పింఛన్లు తొలగించారని సర్పంచ్ కృష్ణ వైద్య శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ముద్దురులో కొన్ని గ్రామాల్లో ఆశా కార్యకర్తలకు పింఛన్లు ఇస్తుండగా తమ గ్రామ ఆశా కార్యకర్త అప్పయ్యమ్మకు పింఛన్ తొలగించారని సర్పంచ్ మునకాల పైడిపునాయుడు అధికారులకు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ గోపాలరాజు, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎంపీడీవో గిరిబాల, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమస్యలపై తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు